







స్వర్ణరథంపై ఊరేగుతున్న అమ్మవారు

గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువుగా..

తిరుచానూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీవారి ప్రియ వాహనమైన గరుడుడిపై లోకమాత ఊరేగారు. శ్రీవారి పాదాలు, సహస్ర లక్ష్మీకాసుల హారంతో ఉత్సవమూర్తిని అలంకరించారు. తన పతి శ్రీమహావిష్ణువు రూపంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. కళాబృందాలు, ప్రదర్శనలు, జీయర్ స్వాముల ప్రబంధ పారాయణం, వేదగోష్ఠి, భక్తుల గోవింద నామస్మరణ మధ్య రాత్రి 7 గంటలకు ప్రారంభమైన గరుడ వాహన సేవ 10.30 గంటల వరకు సాగింది. గరుడుడిపై అమ్మవారిని తిలకించడానికి తరలివచ్చిన భక్తులతో మాడవీధులు, పుష్కరిణి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం సర్వభూపాల వాహనసేవ వైభవంగా జరిగింది. అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం అద్దాల మండపం నుంచి ఉత్సవర్లను వాహన మండపానికి తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. దర్బార్ కృష్ణుడి అలంకారంలో తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమాల్లో జియ్యర్ స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర, పనబాక లక్ష్మి, సాంబశివరావు, జానకీదేవి, ఆలయ డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

● **బంగారుతేరుపై త్రిలోక పావని :** గరుడసేవకు ముందు స్వర్ణరథం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్నపన తిరుమంజనం అనంతరం అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి, మధ్యాహ్నం 3.30 గంటలకు ఉత్సవమూర్తిని ఆలయం నుంచి వేంచేపుగా రథ మండపానికి తీసుకొచ్చి స్వర్ణరథంపై కొలువుదీర్చారు. భక్తుల కోలాటాలు, భజన బృందాల నడుమ 4.20 గంటలకు సర్వతేజోమయమైన అమ్మవారు స్వర్ణరథంపై తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. అమ్మవారు శ్రీమహాలక్ష్మి రూపాన్ని ధరించి అభయప్రదానం చేశారు.



● **శ్రీవారి పాదుకల ఊరేగింపు**

గరుడోత్సవంలో అమ్మవారికి శ్రీవారి పాదుకలను అలంకరించడం ఆనవాయితీ. తిరుచానూరులో గరుడసేవ రోజున అమ్మవారికి శ్రీవారు తన గుర్తుగా పాదుకలు పంపుతారని పురాణాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయం నుంచి స్వామివారి స్వర్ణ పాదుకలను తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకొచ్చి అర్చకులు పూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాలు, భజన బృందాల నడుమ వాటిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి శ్రీవారి పట్టపురాణి పద్మావతీ అమ్మవారు స్వామివారి పాదుకలు ధరించి గరుడసేవలో తరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం
మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం
రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం

కేంద్ర నిధులు ఖర్చు చేయండి

● వెనక్కిపోయే ప్రమాదం ఉంది
● దిశ సమీక్ష సమావేశంలో ఆందోళన
● శ్రీకాళహస్తి కమిషనర్ గైర్హాజరు...
క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా జిల్లాకు కేటాయించే నిధులను సకాలంలో ఖర్చు చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణా కమిటీ) త్రైమాసిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సకాలంలో వాటిని వినియోగించుకోకపోతే వెనక్కి వెళతాయని, తిరిగి విడుదలయ్యే అవకాశమే ఉండదని అన్నారు. అనంతరం వివిధ పథకాల అమలు తీరును కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి సమీక్షించారు.

పీఎం ఆదర్శ గ్రామాలకు
రూ.10 కోట్లిస్తే ఖర్చు పెట్టింది రూ.1.11 కోట్లే!

పీఎం ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఈ ఏడాది మేలో రూ.10.33 కోట్లు సర్దుబాటు కాగా అందులో ఇప్పటి దాకా కేవలం రూ.1.11 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం పట్ల ఎంపీ, కలెక్టర్ ఇరువురూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబరు 31వ తేదీలోపు నిధులను ఖర్చు చేయకుంటే వెనక్కిపోతాయని హెచ్చరించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

చెరువుల్లో గుంతలు తవ్వడమే ఉపాథా?

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో కేవలం చెరువుల్లో గుంతలు తవ్వే పనులు తప్ప వేరే పనులు ప్రతిపాదించడం లేదని డ్వామా శ్రీనివాస ప్రసాద్ సమావేశం దృష్టికి తెచ్చారు. గతేడాది రూ.157 కోట్ల పనులు చేపట్టగా అందులో ఇంకా రూ.46 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందన్నారు. రూ.8.98 కోట్లతో సీసీ రోడ్లు, రూ.10.39 కోట్లతో బీటీ రోడ్లు కొత్తగా చేపడతామన్నారు. రోడ్ కనెక్టివిటీ లేని గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే శ్మశాన వాటికలకు దారులు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఎంపీ, కలెక్టర్ ఆదేశించారు. నాయుడుపేట మండలంలో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు కట్టి మూడేళ్లవుతున్నా ఫైనల్ బిల్లులు మంజూరు కాలేదని ఎంపీపీ ధనలక్ష్మి ఫిర్యాదు చేశారు. బిల్లుల మంజూరులో వివక్ష ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో ఎంపీ గురుమూర్తి

జిల్లాలో 24 వేల ఇళ్లు పూర్తి

హౌసింగ్‌పై సమీక్షలో జిల్లాలో 37,400 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటికి 24,390 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు చెప్పారు.

జిల్లాకే సీఎస్ఆర్ నిధులు

జిల్లాలోని పరిశ్రమల నుంచి రూ.180 కోట్లు సీఎస్ఆర్ కింద రావాల్సి ఉందని, ఈ నిధులను జిల్లా అవసరాలకే వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

శ్రీకాళహస్తి కమిషనర్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం

కాగా దిశ సమావేశానికి శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ గైర్హాజరయ్యారు. ఆయనకు బదులు మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చిన మహిళా ఉద్యోగి ఒకరు సమాధానమిచ్చారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహించారు. కమిషనర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పలువురు మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, ఎంపీపీలు, డీఆర్వో నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

181 చెరువుల అభివృద్ధికి రూ.515 కోట్లతో ప్రతిపాదనలు

జలవనరుల శాఖలో ట్రిపుల్ ఆర్ కార్యక్రమం కింద ఎక్కువ ఆయకట్టు కలిగిన 181 చెరువులను అభివృద్ధి చేసేందుకు రూ.515 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని ఆ శాఖ అధికారులు చెప్పారు. ఈ పనులకు 60-40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్రాలు నిధులు కేటాయించాల్సి ఉందని, అలాగే కాలువల అభివృద్ధికి మరో రూ.200 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. జిల్లాలో తరచూ తుఫాన్ల బెడద ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలకు 570 పనులు ప్రతిపాదించామని వివరించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

● వడమాలపేటలో అత్యధికంగా 54.2మి.మీ.

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వీస్తున్న తూర్పు గాలుల ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం తిరుపతి నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో తేలికపాటి వానపడింది. వడమాలపేటలో అత్యధికంగా 54.2మి.మీ. వర్షపాతం నమోదైంది. బీఎన్‌కండ్రిగ 53.4, బాలయ్యపల్లె 49.6, చిట్టమూరు 48.8, ఎర్రావారిపాళెం 40, ఓజిలి 38.6, నాగలాపురం 35.4, డక్కిలి 31.8, ఏర్పేడు, తడ 30.4, తొట్టంబేడు 29.8, తిరుపతి అర్బన్ 26.2, రూరల్ 25.4, గూడూరు, సత్యవేడు, ఆర్‌సీపురం, నాయుడుపేట, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లులో 24.6మి.మీ. వంతున నమోదైంది. జిల్లాలో సగటున 26.5మి.మీ వర్షపాతం నమోదైంది. సోమ, మంగళవారాల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశముండటంతో ముందస్తు జాగ్రత్తగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

టాస్క్‌ఫోర్సు ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ



టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడిని కలిసిన ఏఎస్పీ కులశేఖర్

మంగళం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్సు అదనపు ఎస్పీగా కులశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తిరుపతి ఏఎస్పీ(శాంతిభద్రతలు)గా పనిచేశారు. టాస్క్‌ఫోర్సుకు అటాచ్ చేయడంతో టాస్క్‌ఫోర్సు హెడ్, ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు.

పంచమితీర్థం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ

తిరుచానూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష ఘట్టమైన పంచమితీర్థం ఈనెల 25వ తేదీన జరుగనుంది. అమ్మవారి పుష్కరిణి పద్మసరోవరంలో జరిగే ఈ ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా టీటీడీ, పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. శనివారం అమ్మవారి ఆలయ మాడవీధులతోపాటు పుష్కరిణిని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. పంచమితీర్థం విజయవంతానికి అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని జేఈవో వీరబ్రహ్మం సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్ ఆస్తులపై ఏసీబీ ఆరా

● రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి వివరాలు తెప్పించే పనిలో అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి చోరీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రవికుమార్ ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. అతని ఇళ్లు, వ్యాపార లావాదేవీలు, స్థిర, చరాస్తులకు సంబంధించిన వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. తిరుపతి, చంద్రగిరి, విజయవాడ, హైదరాబాద్, తమిళనాడులోని చెన్నైతోపాటు మరో ఐదు ప్రాంతాల్లో, కర్ణాటకలోని ధార్వాడ్, హుబ్లీ, బెంగళూరుల్లో భారీ ఎత్తున ఆస్తులను గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు సేకరించే పనిలో ఏసీబీ అధికారులు ఉన్నారు. భూములు, ప్లాట్లు, మామిడి తోపులు, అపార్టుమెంట్లు, విల్లాలు, ఇతర చరాస్తులు ఎవరి పేర్లతో ఉంచాడు? బినామీలు ఎవరు? ఇతని వెనుక వుండి కథ నడిపించిన సూత్రధారులు ఎవరు అనే వివరాలు సేకరిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి డాక్యుమెంట్లు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

రేపటి నుంచి పునఃవిచారణ


పరకామణి కేసు వారం రోజుల విరామం తర్వాత సోమవారం నుంచి పునఃప్రారంభం కానుంది. హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ డీజీ నేతృత్వంలో ప్రస్తుత దర్యాప్తు అధికారులతో పాటు అదనంగా మరో 10 మంది సీఐ, ఎస్‌ఐలను విచారణ నిమిత్తం నియమించారు. రవికుమార్‌తో పనిచేసిన సిబ్బందితో పాటు కొంతమంది టీటీడీ పెద్దలను తిరుపతి పద్మావతి అతిథిగృహంలో విచారించనున్నారు. మాజీ సీవీఎస్వో నరసింహ కిషోర్‌ను కూడా విచారించే అవకాశముంది.

రేపటి నుంచి 'రైతన్నా మీకోసం'

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో సోమవారం నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖల సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతూ ఈ కార్యక్రమంలో పాల్గొని సూచనలు, అభిప్రాయాలు తెలపాలని కోరారు.

నిండిన కాళంగి

మూడు గేట్ల ఎత్తివేత



కేవీబీపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరడంతో మండలంలోని కాళంగి జలాశయం నిండింది. నీటి మట్టం 20 అడుగులకు చేరడంతో అధికారుల సూచనల మేరకు శనివారం 18 గేట్లలో మూడు గేట్లను మూడు అడుగుల ఎత్తున ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ నదియ తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్ ఫిబ్రవరిలోపు ఇవ్వండి

● జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన),నవంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ (యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్)ను 2026 ఫిబ్రవరి 28వ తేదీలోపు అందజేయాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఎం.లక్ష్మీకర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ గతంలో నవంబరు, డిసెంబరు నెలల్లో సర్టిఫికెట్ తీసుకునే వారని, ఇప్పుడు దాన్ని జనవరి, ఫిబ్రవరికి మార్చినట్లు చెప్పారు. జిల్లాలోని 17,426 మంది పెన్షనర్ల సౌకర్యార్థం తిరుపతిలోని ఉప ఖజానా కార్యాలయంలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాకాల, చంద్రగిరి, పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వాకాడు, గూడూరు, వెంకటగిరిలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోనూ సర్టిఫికెట్ అందజేయవచ్చన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని ఇండియన్ రైల్వే కోచింగ్ విభాగం ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్ కింది స్థాయి అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. టెండర్ ఒప్పందం మేరకు నిర్ణయించిన గడువు లోపు పనులు ఎందుకు పూర్తి చేయలేదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అంతకు ముందు ఆధునిక స్టేషన్ ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూశారు. ఈ కార్యక్రమంలో జోనల్ చీఫ్ ఇంజనీర్ కె.సూర్యనారాయణ, నిర్మాణాల విభాగం అధికారులు శ్రీనిబాష్, జి.వామనమూర్తి, సీనియర్ డీపీఎం శ్రావణకుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, దరూరు ప్రభాకర్, మాధవరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్ కుమార్

28 వరకు తిరుపతి - హిస్సార్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి - హిస్సార్ మధ్య నడుస్తున్న వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను డిసెంబరు 28వ తేదీ వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్‌లు ప్రతి బుధవారమూ తిరుపతి నుంచి, ప్రతి ఆదివారమూ హిస్సార్ నుంచి బయలుదేరుతాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కూన రవికుమార్ - నందమూరి రామకృష్ణ

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పియూసీ) చైర్మన్ కూన రవికుమార్, నందమూరి రామకృష్ణ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయ అధికారులకు నక్షత్ర హారతిని అందజేస్తున్న దాతలు

కల్యాణ వెంకన్న ఆలయానికి వెండి నక్షత్ర హారతి విరాళం

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాదుకు చెందిన మణికుమార్, కొండల్‌రెడ్డి, రాకేష్, రాజేష్‌లు కలిసి రూ.2,61,875 విలువగల 1.192 కేజీల బరువు గల వెండి నక్షత్ర హారతిని శనివారం ఆలయ అధికారులకు విరాళంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,098

తలనీలాలు సమర్పించినవారు: 24,962





కళా ప్రదర్శనల వైభవం



తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వాహన సేవల్లో వివిధ రాష్ట్రాల కళాకారులు తమ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా చేసిన కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సర్వభూపాల వాహన సేవలో కర్ణాటకకు చెందిన నాన మిత్ర చండీమేళం బృందం ప్రదర్శించిన నృత్యం అలరించింది. రాజమండ్రికి చెందిన కుమారి రాణి బృందం కేరళ డ్రమ్స్ ఆకట్టుకున్నాయి. మహారాష్ట్రకు చెందిన శ్రీలక్ష్మీనారాయణ బృందం జోత్రం, చంగ్టలే బృందం లెస్క్యూమ్ నృత్యం, సేలంకు చెందిన గోవిందరాజు బృందం కంసాలే నృత్యాలు, కోలాటాలు భక్తులను మైమరపించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి





10 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అటవీశాఖ అధికారులు

● కారు సీజ్

మంగళం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రేణిగుంట - కడప రహదారిలోని ఆంజనేయపురం చెక్ పోస్టు వద్ద శనివారం తిరుపతి అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. అటవీ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం రాత్రి నుంచి ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద టీఎస్‌పాశెం సెక్షన్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున అటువైపుగా ఏపీ31 బీఈ 3144 నెంబరు గల కారు వేగంగా వస్తుండటాన్ని గమనించిన సిబ్బంది టార్చ్‌లైట్లు వేసి ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా వేగంగా కొంతదూరం వెళ్లి డ్రైవర్ కారును వదలిపారిపోయాడు. కారును తనిఖీ చేయగా 10 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గమనించారు. దీంతో వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం 280.4 కేజీలు బరువు ఉందని, కారుతో సహా ఎర్రచందనం విలువ రూ.6లక్షలు ఉంటుందని అటవీ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో డీఆర్వో ఆర్‌ఎస్ చైతన్య, ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, కరకంబాడి బీట్ ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, వెంకటేష్, ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

పాకాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్యాడెట్స్ ఎన్‌సీసీ గీతాన్ని ఆలపించారు. కళాశాల ఆవరణలో జామ, సపోట మొక్కలు నాటారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఈశ్వరబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది క్యాడెట్స్‌వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. క్యాడెట్స్ దేశ రక్షణ దళాల్లో చేరి జాతీయ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిట్టికళావతి, మోహన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

పాకాల కోర్టు ఏజీపీగా మురళి



పాకాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా కోరా మురళి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఏజీపీగా మూడేళ్లపాటు విధులు నిర్వహించనున్నారు. పాకాల మండలం మొగరాల పంచాయతీ కృష్ణాపురానికి చెందిన న్యాయవాది కోరా మురళి ఏజీపీగా నియమితులు కావడంపై సహన్యాయవాదులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రాథమిక విద్య బలోపేతంతోనే దేశాభివృద్ధి

ఎర్రావారిపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య బలోపేతంతోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందని సమగ్ర శిక్ష ఏపీసీ గౌరీశంకర్ అన్నారు. శనివారం మండలం కేంద్రంలో జరుగుతున్న క్లస్టర్‌స్థాయి ఉపాధ్యాయ మాస శిక్షణా తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతిక మాధ్యమ బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు ఆకలింపు చేసుకొని బోధనలో సమ్మిళితం చేయాలని కోరారు. అనంతరం స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించారు.

'పరకామణి' పిటిషనర్‌కు 24 గంటలు పోలీసు భద్రత

- హైకోర్టు ఆదేశంతో తిరుపతి పోలీసుల చర్యలు -

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి చోరీ కేసులో లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాడాన్ని తప్పు పడుతూ హైకోర్టులో కేసు వేసిన జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసులుకు భద్రత కల్పించేందుకు తిరుపతి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయనకు తగిన భద్రత కల్పించాలని తిరుపతి జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించడంతో అలిపిరి సీఐ రాంకిషోర్ శనివారం శ్రీనివాసులు ఇంటిని పరిశీలించారు. ఆయన ఇంట్లోని సీసీ కెమెరాలను పోలీసుస్టేషన్‌కు అనుసంధానం చేశారు. బీట్ బుక్ ఏర్పాటు చేశారు. బ్లూకోల్ట్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇంటి వద్ద 24 గంటలు పోలీసు నిఘా ఉంటుందని సీఐ వివరించారు. పరకామణి చోరీ ఘటనపై సీఐడీ విచారణకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యం వేసిన తనకు బెదిరింపులు వస్తున్నాయని, భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల 15న వినతి సమర్పించినా పోలీసుల నుంచి ఎలాంటి స్పందనా లేదని జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తు ముగిసేవరకు భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం శనివారం విచారణకు వచ్చింది. ఈ కేసులో సాక్షులు, నిందితుడికి భద్రత కల్పించాలని సీఐడీ డీజీని హైకోర్టు ఆదేశించిందని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిరోహిత్ వాదనలు వినిపించారు. ఈ మేరకు ఎస్పీని ఆదేశించాలని కోరుతూ సీఐడీ డీజీ రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారన్నారు. సాక్షుల జాబితాలో పిటిషనర్ పేరు కూడా ఉందని వివరించారు. దీంతో కేసు దర్యాప్తు ముగిసే వరకు పిటిషనర్‌కి తగిన భద్రత కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్ జిల్లా హాకీ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే నాని, శాప్ డైరెక్టర్ రజిని

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా అండర్-14 హాకీ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 234 మంది బాలురు, 234 మంది బాలికలు పాల్గొంటున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ డైరెక్టర్ రజిని, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు, డీఈవో కేవీఎన్ కుమార్, క్రీడా పోటీల పరిశీలకులు థామస్, డీవైఈవో ఇందిరాదేవి విచ్చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడా మైదానంలో జ్యోతి ప్రజల్వన చేసి, జాతీయ జెండాను, క్రీడా జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడమే కాకుండా సముచిత గౌరవం కల్పిస్తుందన్నారు. హాకీ టోర్నమెంట్ కోసం 13 జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. చంద్రగిరిలో మినీ స్టేడియం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. శాప్ డైరెక్టర్ రజిని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని, క్రీడాకారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ, ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం బాలికల చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి సేవ అభినందనీయం

● ఎమ్మెల్యే పులివర్తి నాని



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని, దాత భానుప్రకాష్

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థి, సైకిళ్ల దాత భానుప్రకాష్ సేవా దృక్పథం అభినందనీయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి మండలం దోర్నకంబాల ఉన్నత పాఠశాలలో శనివారం అదనపు తరగతి గదులను, సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు భానుప్రకాష్‌ని సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, హెచ్‌ఎం జగదీష్, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్, సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, ముడిపల్లి సురేష్ రెడ్డి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో...

చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా ఐటీ, ఐటీఈఎస్ ఒకేషనల్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ఈల్యాబ్‌కు మండలంలోని దోర్నకంబాల గ్రామానికి చెందిన భానుప్రకాష్ రూ.2.5 లక్షల విలువ గల కంప్యూటర్లు, పర్నీచర్‌ను వితరణ చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

● కార్మిక నాయకులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం శనివారం నుంచి అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో రద్దు చేసేవరకు ఆందోళనలు చేస్తామని కార్మిక సంఘాల నాయకులు టి.సుబ్రమణ్యం, రాధాకృష్ణలు హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వున్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నాలుగు లేబర్ కోడ్‌ల అమలు ఉత్తర్వుల జిరాక్స్ పేపర్లను కార్మిక సంఘాల నాయకులు దగ్ధం చేశారు. నాయకులు ఎస్.జయచంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, మునిరాజా, ఆర్.లక్ష్మీ, వేణుమాదవ్, పి.బుజ్జి, కేవై రాజా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ కాలేజీలో రక్తదాన శిబిరం

తిరుపతి రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలకు చెందిన 43మంది విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్(డీఎస్‌ఏ)డాక్టర్ వి.వైకుంఠరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య ప్రారంభించి మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడమే కాకుండా ఎన్నో ప్రాణాలను రక్షిస్తుందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తిరుపతిశాఖ అధికారి ఎం.వెంకటసుబ్బారావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శ్వేత, శ్వేతక్రాంతి, టీవీ చైతన్యకుమార్, అధ్యాపకులు డాక్టర్ సుధీర్, మురళి, స్రవంతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న సుదర్శనరావు, దుర్గాప్రసాద్

తిరుపతిరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలంటే నిరంతర సాధన, నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.తారకేశ్వర్ మాట్లాడుతూ.. యూజీ ఇంజనీరింగ్‌లో 1100మంది విద్యార్థులు, పీజీ(ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్)లో 385మందికి కలిపి మొత్తంగా 1485మందికి డిగ్రీలు ప్రదానం చేశామన్నారు. 13మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందజేసినట్లు పేర్కొన్నారు. చైర్మన్ ఎ.గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రకాష్, సెక్రటరీ ప్రదీప్, డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంబీయూలో సంబరాలు



ఎంబీయూలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శనివారం సంబరాలు చేసుకొన్నారు. ఎంబీ యూ ఛాన్సలర్ పద్మశ్రీ డాక్టర్ మోహన్‌బాబు తెలుగు వెండి తెరపై 50 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా, ఎంబీయూ ప్రొఛాన్సలర్ మంచు విష్ణు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, ఎంబీయూలోని సిబ్బంది కేక్ కట్ చేసి, స్వర్ణోత్సవ సంబరాలు చేసుకొన్నారు. వైస్‌ఛాన్సలర్ డాక్టర్ రాగరాజరామరావ్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, డీఎఫ్‌వో బి.రవిశేఖర్, జీఎం, డీన్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎ.రంగంపేటలో మోహన్‌బాబు అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొన్నారు. మౌళి, మల్లికార్జున, కిరణ్, మధు పాల్గొన్నారు.

తనపల్లెలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్

తిరుపతి రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తనపల్లె పంచాయతీల్లో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 32 పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు హాజరై గ్రామంలోని ఆరు హ్యాబిటేషన్ల పరిధిలో చెత్త, చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. కాలువలో వ్యర్థాలను తొలగించారు. ఇళ్లమధ్యలో పేడదిబ్బలు వేసిన వారికి నోటీసులు అందించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్, కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

'సాహితీహృదయం' ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఆచార్యులు, అతిథి ఉపన్యాసకులు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ సెనేట్‌హాల్లో 'బెజవాడ గోపాలరెడ్డి సాహితీ హృదయం' పుస్తకావిష్కరణ కార్యక్రమం చేపట్టింది. రెక్టార్ అప్పారావు, మాజీ వీసీ రామ్మూర్తి పుస్తకావిష్కరణ చేశారు. స్వాతంత్ర్యయోధుడుగా, సీఎంగా, గవర్నర్‌గా, కేంద్రమంత్రిగా, రచయితగా బహుముఖ ప్రతిభాశాలీగా బెజవాడ గోపాలరెడ్డి నిలిచారన్నారు. ఈ అంశాలతో పుస్తకం రాసిన విశ్రాంతాచార్యులు కె.మహాలక్ష్మమ్మను అభినందించారు. సభను ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరమ్మ, విశ్రాంతాచార్యులు జి.దామోదర నాయుడు నిర్వహించారు. పుస్తక సమీక్షను డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యేశ్వర రెడ్డి చేశారు. సభలో బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రఘుపతి మాట్లాడారు. పలువురు ఆచార్యులు, అతిథి ఉపన్యాసకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడూరుకు పలువురి శుభాకాంక్షలు



కపిలతీర్థం వద్ద బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న టీడీపీ బీసీ నేతలు

తిరుపతి(నేరవిభాగం), నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం జన్మదిన వేడుకలు తిరుపతి నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం కపిలతీర్థం వద్ద అల్పాహార అన్నదానం, మధ్యాహ్నం రుయా ఆస్పత్రిలో రాష్ట్ర బీసీ సెల్ నేత బీజీ కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో, గాంధీ రోడ్డులో రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కేటీ రోడ్డులో టీడీపీ మహిళా నేత పుష్పావతి యాదవ్ నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణయాదవ్, సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, చరణ్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు. బ్లిస్ సర్కిల్‌లో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. నాగరాజు, నందగోపాల్‌నాయుడు, రమేష్, సునీల్ పాల్గొన్నారు.

మానవ సంబంధాలే మానసిక ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలే మనిషి మానసిక ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయని ఎస్వీయూనివర్సిటీ వీసీ నరసింగరావు పేర్కొన్నారు. ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో అడ్వాన్స్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా (ఏపీఏఐ) - స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ రామ్మూర్తి స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. ఉమారాణికి రూ. 5 వేల నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఏపీఏఐ అధ్యక్షులు డాక్టర్ నీరజ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ప్రొఫెసర్ రామ్మూర్తి పేర పురస్కార ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, సైకాలజిస్టులు విశేష్, కృష్ణభరత్, విద్యార్థులు, ఏపీఏఐ సభ్యులు రాజశేఖర్, గణేష్, లోకపావని, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ఉమారాణికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న దృశ్యం

రక్తదానం ప్రాణదానంతో సమానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఈ నెల 28వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిరుపతిలో చేపట్టనున్న రక్తదాన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరసన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ తల్లి కన్నా గురువు మిన్న

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గూగుల్ తల్లి కన్నా గురువు మిన్న అని ఎస్వీయూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు పేర్కొన్నారు. పద్మావతి డిగ్రీ-పీజీ కాలేజీలో శనివారం నిర్వహించిన విద్యార్థి సంఘ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నూతన విద్యార్థి కౌన్సిల్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా అధ్యాపకులకు క్రీడా పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని మహిళా అధ్యాపకులకు క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించారు. వీసీ నరసింగరావు ఈ పోటీలను ప్రారంభించారు. విజేతలకు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శివశంకరరెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. ప్రొఫెసర్లు భారతి, సావిత్రమ్మ, శ్రీదేవి, కొండేటి సునీత, స్వరూప, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో 16 మందికి జరిమానా విధిస్తూ మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి సంధ్యారాణి శనివారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి కథనం మేరకు.. ఇటీవల నగరంలో మద్యం సేవించి రోడ్డుపైకి వచ్చిన 16మంది మందు బాబులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచారు. విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న మరో 21మందికి ఒక్కొక్కరికి రూ.500 వంతున జరిమానా విధించారు.

రాజ్యహింసపై న్యాయవిచారణ జరపాలి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సల్స్‌ను అరెస్టు చేసిన అనంతరం బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి చంపిన ఘటనలపై న్యాయవిచారణ జరపాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శనివారం బూటకపు ఎన్‌కౌంటర్లపై రౌండ్ టేబుల్ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎ.రామానాయుడు(సీపీఐ), వి.నాగరాజు(సీపీఎం), పి.అంజయ్య(ఆర్‌పీఐ), వెంకటరత్నం(సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ)లు పాల్గొని ప్రసంగిస్తూ హిడ్మాను హతమార్చిన అనంతరం మరింతగా రెచ్చిపోయి అడ్డుతగిలిన గిరిజనులను కూడా బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి చంపుతోందన్నారు. హిడ్మాను చంపిన తీరుపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నేతలు క్రాంతి చైతన్య, సీనియర్ పాత్రికేయులు రాఘవశర్మ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంతర డిగ్రీ కళాశాలల ఉద్యోగుల క్రీడలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలోని అంతర డిగ్రీ కళాశాలల ఉద్యోగుల(మహిళల, పురుషుల) క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 15 కళాశాలలకు చెందిన 50మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్వీయూ వీసీ నరసింగరావు పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసికోల్లాసంతో పాటు పని ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ప్రొఫెసర్లు బీవీ మురళీధర్, ఎం.శివశంకర్ రెడ్డి, టి.సురేంద్రనాథ్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

- 22 ద్విచక్ర వాహనాలపై కేసుల నమోదు

తిరుపతి(రవాణా), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అతికా నాజ్ అన్నారు. జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ ఆదేశాల మేరకు శనివారం కరకంబాడి రోడ్డులో సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, లైసెన్సు లేనివారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులోభాగంగా 22 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేసి యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎంవీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మోటారు వాహనాల సెక్షన్ 184 ప్రకారం మొబైల్ ఫోన్ డ్రైవింగ్ చేసిన వారికిమొదటిసారిగా రూ.1,500 జరిమానా, రెండవసారి అదే వాహనాన్ని వినియోగిస్తూ మొబైల్ డ్రైవింగ్ చేస్తే రూ.10వేలు జరిమానా ఉంటుందన్నారు. అతికానాజ్ మాట్లాడుతూ మొబైల్ డ్రైవింగ్ చేసిన వారి లైసెన్సులు మూడు నెలల వరకు సస్పెండ్ చేయడానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత పాల్గొన్నారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు



హరికథాగానం చేస్తున్న డాక్టర్ వనారస విజయకుమారి

తిరుపతి(జీవకోన), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణ, ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక మహాభారత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం డాక్టర్ వనారస విజయకుమారి భాగవతారిణి చేసిన హరికథాగానం ఆకట్టుకుంది. అనంతరం ద్రౌపదీ కల్యాణం నిర్వహించారు. రాత్రికి ప్రదర్శించిన వారణావతం నాటకం ఆహుతులను ఎంతగానో అలరించింది. జీవలింగేశ్వరస్వామి ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు వివిధ నాటక ప్రదర్శనలు జరగనున్నాయి. 23న బకాసుర వధ, 24 ద్రౌపదీ కల్యాణం, జూదం, 25న ద్రౌపదీ మాన సంరక్షణ, 26న తపస్సు, శశిరేఖా పరిణయం, 27న నర్తనశాల, కీచకవధ, 28న ఉత్తర గోగ్రహణం, 29న శ్రీకృష్ణరాయబారం, కురుక్షేత్రం, 30న దుర్యోధన వధ, చివరగా అగ్నిగుండ ప్రవేశంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

ప్రాచీన కళలను యువతకు దగ్గర చేయడానికే...



ప్రాచీన కళలను యువతకు దగ్గర చేయడానికి మహాభారత ఉత్సవాలను ప్రతి యేడాది నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో మాత్రమే నిర్వహించే ఈ ఉత్సవాలను తిరుపతిలో నిర్వహించడంతో స్థానిక ప్రజలు పెద్దఎత్తున హాజరవుతూ కనులారా వీక్షిస్తున్నారు. సంస్కృతి సంప్రదాయాలను మరువకుండా ఉండేందుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

- అన్నా రామకృష్ణ, ఉత్సవాల నిర్వహకులు, ఆలయ చైర్మన్


22వ ఓపెన్ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్ ప్రారంభం



రవినాయుడిని సన్మానిస్తున్న ఓపెన్ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్ నిర్వాహకులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆఫీసర్స్‌క్లబ్‌లో 22వ ఓపెన్ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్ టోర్నీ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ బ్రిడ్జ్ వంటి క్రీడలతో చురుకుదనం, వ్యూహాత్మక ఆలోచన, సమయోచిత నిర్ణయం, సామర్థ్యం, సమన్వయ భావన వంటి విలువైన లక్షణాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరి రవీంద్ర, నరసింహారావు, నాగరాజు, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

భారత్- ఆఫ్రికా దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలి



సభలో మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత్ - ఆఫ్రికా దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ నరసింగరావు అన్నారు. యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం గతంలో చేపట్టిన భారత్ - ఆఫ్రికా సంబంధాలు అంశంపై సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాలకు సంబంధించిన పుస్తకాన్ని శనివారం వర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో ఆయన ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. ఆఫ్రికా దేశంతో మనం సత్సంబంధాలు మెరుగుపరుచుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక సంపాదకులు ప్రొఫెసర్ బీవీ మురళీధర్, ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్, ఉప సంపాదకులు ఐఎస్ కిషోర్, ఐ.సుబ్రమణ్యం, కెఎస్ కన్నన్, బి.నాగరత్నంరెడ్డి, వర్సిటీ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, కల్యాణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ నిరోధకత ప్రపంచానికి పెను ముప్పు

తిరుపతి(వైద్యం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యాంటీబయాటిక్స్ నిరోధకత ప్రపంచ ఆరోగ్యానికి పెను ముప్పుగా మారుతోందని ఎస్వీ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవిప్రభు, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ రవిప్రకాష్ పేర్కొన్నారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అవేర్‌నెస్ వీక్ - 2025 కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఎస్వీ మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. యాక్ట్ నౌ ప్రొటెక్ట్ అవర్ ప్రజెంట్ సెక్యూర్ అవర్ ఫ్యూచర్ నినాదంతో మెడికల్ విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు యాంటీబయాటిక్స్ వినియోగాన్ని తగ్గించుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ బి.మనోహర్, వైద్య కళాశాల పీఆర్వో వీరకిరణ్, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎస్వీ హైస్కూల్‌కు ఆట వస్తువుల వితరణ



ఆట వస్తువులను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుమల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఎస్వీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు శనివారం రూ.58 వేల విలువ కలిగిన ఆట వస్తువులను అందజేశారు. ఆటవస్తువులను అందుకున్న ప్రధానోపాధ్యాయులు కిషన్ మాట్లాడుతూ.. పిల్లల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులకు ఆట వస్తువులు అందచేసిన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. పీఈటీలు వెంకటరమణ, విశ్వనాథ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీను యాదవ్, సభ్యులు గోవర్ధన్, కుమార్, రమణ, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీకి చెందిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు విడుదల చేశారు. ఫలితాలను కాలేజీ కార్యాలయంలో చూసుకోవచ్చని వారు తెలిపారు.





కళా ప్రదర్శనల వైభవం



తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి వాహన సేవల్లో వివిధ రాష్ట్రాల కళాకారులు తమ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా చేసిన కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సర్వభూపాల వాహన సేవలో కర్ణాటకకు చెందిన నాన మిత్ర చండీమేళం బృందం ప్రదర్శించిన నృత్యం అలరించింది. రాజమండ్రికి చెందిన కుమారి రాణి బృందం కేరళ డ్రమ్స్ ఆకట్టుకున్నాయి. మహారాష్ట్రకు చెందిన శ్రీలక్ష్మీనారాయణ బృందం జోత్రం, చంగ్టలే బృందం లెస్కూమ్ నృత్యం, సేలంకు చెందిన గోవిందరాజు బృందం కంసాలే నృత్యాలు, కోలాటాలు భక్తులను మైమరపించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి









'పరకామణి' పిటిషనర్‌కు

24 గంటలు పోలీసు భద్రత

హైకోర్టు ఆదేశంతో తిరుపతి పోలీసుల చర్యలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి చోరీ కేసులో లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడాన్ని తప్పు పడుతూ హైకోర్టులో కేసు వేసిన జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసులుకు భద్రత కల్పించేందుకు తిరుపతి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయనకు తగిన భద్రత కల్పించాలని తిరుపతి జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించడంతో అలిపిరి సీఐ రాంకిషోర్ శనివారం శ్రీనివాసులు ఇంటిని పరిశీలించారు. ఆయన ఇంట్లోని సీసీ కెమెరాలను పోలీసుస్టేషన్‌కు అనుసంధానం చేశారు. బీట్ బుక్ ఏర్పాటు చేశారు. బ్లూకోల్ట్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇంటి వద్ద 24 గంటలు పోలీసు నిఘా ఉంటుందని సీఐ వివరించారు. పరకామణి చోరీ ఘటనపై సీఐడీ విచారణకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యం వేసిన తనకు బెదిరింపులు వస్తున్నాయని, భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల 15న వినతి సమర్పించినా పోలీసుల నుంచి ఎలాంటి స్పందనా లేదని జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తు ముగిసేవరకు భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం శనివారం విచారణకు వచ్చింది. ఈ కేసులో సాక్షులు, నిందితుడికి భద్రత కల్పించాలని సీఐడీ డీజీని హైకోర్టు ఆదేశించిందని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిరోహిత్ వాదనలు వినిపించారు. ఈ మేరకు ఎస్పీని ఆదేశించాలని కోరుతూ సీఐడీ డీజీ రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారన్నారు. సాక్షుల జాబితాలో పిటిషనర్ పేరు కూడా ఉందని వివరించారు. దీంతో కేసు దర్యాప్తు ముగిసే వరకు పిటిషనర్‌కి తగిన భద్రత కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా అంతర్ జిల్లా

అండర్-14 హాకీ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ డైరెక్టర్ రజిని

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా అండర్-14 హాకీ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 234 మంది బాలురు, 234 మంది బాలికలు పాల్గొంటున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ డైరెక్టర్ రజిని, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు, డీఈవో కేవీఎన్ కుమార్, క్రీడా పోటీల పరిశీలకులు థామస్, డీవైఈవో ఇందిరాదేవి విచ్చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడా మైదానంలో జ్యోతి ప్రజల్వన చేసి, జాతీయ జెండాను, క్రీడా జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడమే కాకుండా సముచిత గౌరవం కల్పిస్తుందన్నారు. టోర్నమెంట్ కోసం 13 జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. చంద్రగిరిలో మినీ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. శాప్ డైరెక్టర్ రజిని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం బాలికల చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, సింగిల్‌విండో ఛైర్మన్ రాజులగారి వినోద్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

ఎంవీఐలు శ్రీనివాసరావు, అతికా నాజ్ ● 22 ద్విచక్ర వాహనాలపై కేసుల నమోదు

తిరుపతి(రవాణా), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అతికా నాజ్ అన్నారు. జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ ఆదేశాల మేరకు శనివారం కరకంబాడి రోడ్డులో సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, లైసెన్సు లేనివారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులోభాగంగా 22 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేసి యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎంవీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మోటారు వాహనాల సెక్షన్ 184 ప్రకారం మొబైల్ ఫోన్ డ్రైవింగ్ చేసిన వారికిమొదటిసారిగా రూ.1,500 జరిమానా, రెండవసారి అదే వాహనాన్ని వినియోగిస్తూ మొబైల్ డ్రైవింగ్ చేస్తే రూ.10వేలు జరిమానా ఉంటుందన్నారు. అతికానాజ్ మాట్లాడుతూ మొబైల్ డ్రైవింగ్ చేసిన వారి లైసెన్సులు మూడు నెలల వరకు సస్పెండ్ చేయడానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

మామూళ్ల మత్తులో బెల్టు షాపుల జోరు

వెంకటగిరిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో వందకుపైగా బెల్టు దుకాణాలు ఏర్పాటయ్యాయి. అనధికారిక దుకాణాలకు పట్టపగలే మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం షాపు నుంచి గ్రామాల్లో ఆటోల ద్వారా వారే బెల్టు దుకాణాలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు సమాచారం.గత వైసీపీ ప్రభుత్వంలో ఆపార్టీ ముఖ్యనేతలు, ఎక్సైజ్, పోలీసు శాఖలు ఆడిందే ఆటగా దందా సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా బెల్టు షాపుల జోరు కొనసాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణం నుంచి అధికారులకు నెల వారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తనిఖీకి వచ్చే స్క్వాడ్ బృందాలకు సైతం ముడుపులు ముట్టజెబుతున్నారని తెలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు లైసెన్సుదారుల నుంచి బినామీల పేర్లపై వాటాలు తీసుకోవడంతో మద్యం అక్రమాలను అడ్డుకునే వారు కరవయ్యారనే విమర్శలున్నాయి.



బహిరంగంగానే తాగుతున్న మందుబాబులు

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీలో విద్యార్థులు

నాయుడుపేట టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎల్ఏసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. రాజ్యాంగదినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి తెలిపారు. మాక్ అసెంబ్లీలో 2.0 జీఎస్టీ మీద మాక్ డ్రిల్ నిర్వహించి సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ అంటూ ఒకేదేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్ గురించి విద్యార్థులు చక్కగా ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఆనంద్, చెంచుకుమార్, సుబ్రహ్మణ్యం, సుభాష్‌చంద్ర, అమృతవల్లి, జి. వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, సుధాకరయ్య పాల్గొన్నారు.



స్పీకర్‌గా వ్యవహరిస్తున్న విద్యార్థిని

ఇంజనీరింగ్ మార్పులపై ఫ్యాకల్టీకి అవగాహన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విష్వక్సేనారెడ్డి

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఆటోమోటీవ్ మోడల్స్ డిజైన్, టెస్టింగ్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్వక్సేనారెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో నూతన ధోరణిలు, పరిశ్రమ అవసరాలు, ఆధునిక వాహన సాంకేతిక పరిజ్ఞానాలను అధ్యాపకులకు పరిచియం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్‌రావు, డాక్టర్ రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి

వెంకటగిరి, న వంబర్ 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. వెంకటగిరి మండలం యాతలూరు గ్రామానికి చెందిన రెట్టపల్లి మహేష్ (24) వ్యవసాయ కూలి పనులు చేస్తుంటాడు. ఇతడి భార్య అరుణ తొమ్మిది నెలల గర్భిణి. శనివారం ఉదయం ఎప్పటిలాగే పొలం పనులు చేయడానికి వెళ్లాడు. మధ్యాహ్నం వాతావరణం మారిపోయింది. భారీ వర్షం కురిసింది. దీంతో అక్కడ పనిచేస్తున్న వారితో కలిసి ఓ గుడిసెలో తలదాచుకున్నాడు. వర్షం తగ్గిందని బయటకు రాగానే వెంటనే ఓ పిడుగు మీద పడింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. పక్కనున్న కలవగుంట సురేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మహేష్ మృతితో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. కొన్ని రోజుల్లో భార్య ప్రసవించనున్న తరుణంలో అతడు ప్రాణాలు విడవడం స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



కమిటి సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తదితరులు

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక రైతబజారు సమీపంలోని ధర్మరాజులస్వామి ఆలయంలో ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా వాటంబేడు శివకుమార్, సభ్యులుగా సుజాత, వై.విజయ, కేశవర్ధన్‌రావు, శాంతి, ఏ.విజయ, మౌనిక, సుబ్బరత్న, జయమ్మ, మాధవ, లక్ష్మణ్‌రావు ప్రమాణస్వీకారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు చదలవాడ హరిప్రసాద్, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి టీడీపీ బలోపేతం చేయాలి



నాయకులతో సమావేశమైన టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు

ఓజిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ అనుబంధ సంఘాలను ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు చెప్పారు. ఈమేరకు శనివారం ఓజిలిలోని పార్టీ కార్యాలయంలో గ్రామ కమిటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయినుంచి బలోపేతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, టీసీ, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడె పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కె ఖలీల్, ఏఎంసీ డైరెక్టరు కోటేశ్వరరావు, కురుగొండ సొసైటీ అధ్యక్షులు అంకయ్య, కమలాకర్ పాల్గొన్నారు.

నేడు జిల్లా రెజ్లింగ్ జట్టు ఎంపిక

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోసనూరు రాజుపాలెంలో ఆదివారం జిల్లా రెజ్లింగ్ పోటీలకు ఎంపిక నిర్వహించనున్నట్లు రెజ్లింగ్ క్రీడల ప్రెసిడెంట్ సురేష్, సెక్రటరీ ఉదయ్‌కుమార్, ట్రెజరర్ అభిలాష్‌లు తెలిపారు. పురుషుల ఫ్రీ స్టైల్ విభాగంలో 57, 61, 65, 70, 74, 79, 86, 92 కేజీలు, పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో 55, 60, 63, 67, 72, 77, 82, 87 కేజీలు, మహిళల విభాగంలో 50, 53, 55, 57, 59, 62, 65, 68 కేజీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సంప్రదించాలని కోరారు. 2005లో పుట్టినవారు అర్హులన్నారు. 2006, 2007 జన్మించినవారు మెడికల్ సర్టిఫికేట్ తీసుకు రావాలని కోరారు.

నేడు సత్యసాయి జయంతి

ఓజిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. మండలంలోని అందరు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధికి సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక నియోజకవర్గ విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పొదుపుసంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీఎం చంద్రబాబునాయుడు పొదుపు సంఘాలను తీసుకువచ్చి అనేక సంక్షేమపథకాలను అమలుచేస్తున్నారన్నారు. ఎంపీడీవో మధుసూదన్‌రావు, వివిధశాఖల అధికారుల, పొదుపుసంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారికి గాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు ఈ ఘటన తొట్టంబేడు మండలం సింగమాల వద్ద శనివారం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి పట్టణం వెంకటగిరి బస్టాండు ప్రాంతానికి చెందిన శివయ్య(50) వ్యాపారి. సొంతపనుల నిమిత్తం శనివారం ద్విచక్ర వాహనంపై నాయుడుపేటకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సింగమాల వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరరాజా క్వార్టర్స్‌లో చోరీ

● 450 గ్రాముల బంగారం, మూడు కిలోల వెండి దొంగతనం




చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం - తారకరామానగర్ వైపు వెళ్తున్న డాగ్ స్క్వాడ్

రేణిగుంట నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి అమరరాజా ఫ్యాక్టరీ ప్రాంగణంలోని ఉద్యోగుల క్వార్టర్స్‌లో ఏడు ఇళ్లలో చోరీ జరిగింది. సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... క్వార్టర్స్‌లో శుక్రవారం రాత్రి ఏడు ఇళ్లల్లో దొంగలు చొరబడ్డారు. నాలుగిళ్లల్లో 450 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి వస్తువులను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం క్రైం అదనపు ఎస్పీ నాగభూషణంరావు నేతృత్వంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ చోరీ జరిగిన ఇళ్లలో ఆధారాలను సేకరించారు. మరోపక్క డాగ్ స్క్వాడ్ తారకరామా నగర్ వైపుకు పరుగులు తీసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న మయూర్

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ధర్మకర్తలమండలి ఛైర్మన్ సాయి, సభ్యులు, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మకర్తలమండలి సభ్యులు గుర్రప్పశెట్టి, గోపీనాథ్, టీడీపీ నాయకులు కంఠా రమేష్, కాసరం రమేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు ఆలయం సమీపంలోని ఎంజీఎం గ్రాండ్ వద్ద నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్‌కు ఎంజీఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరు మల్లికార్జుననాయుడు, డైరెక్టర్, తిరుపతి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శ్రీధర్‌వర్మ, ఏఎంసీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామిని మాజీ మంత్రి మోపిదేవి వెంటకరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన్ను బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సెన్‌యార్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కొవాలని అందుకు తగ్గట్టుగా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. తుఫాన్ తీరం దాటే వరకు ప్రతి అధికారి మండల హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ తుఫాన్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లోని అందుబాటులో ఉండాలన్నారు. తుఫాను సమయంలో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, ఏర్లు దాటొద్దని అలాంటి ప్రదేశాల్లో అధికారులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ

సత్యవేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దాణ పంపిణీ చేస్తామని ఇరుగుళం పశు వైద్యాధికారి దయాకర్ పేర్కొన్నారు. ఇరుగుళం పశు వైద్యశాలలో 190 బ్యాగులు, సత్యవేడు ఏడీ కార్యాలయంలో 90 బ్యాగులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఇదేగాక నవంబరు 24వ తేదీ మరో వంద బ్యాగులు శిరుణంబుదూరు పశువైద్యశాలలో అందుబాటులో ఉంటుందన్నారు. 50 కిలోల దాణా రూ.580 అన్నారు. ఒక ఆధార్‌కార్డుపై రెండు బ్యాగులు పాడి రైతులకు ఇస్తారన్నారు. వివరాల కోసం నెం.9581400505లో సంప్రదించాలన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రమాద బీమా అందజేత



పుత్తూరు అర్బన్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కనకంపాళేనికి చెందిన టీడీపీ కార్యకర్త వి.సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రమాద బీమా రూ.5 లక్షల సాయాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందజేశారు. శనివారం సుబ్రహ్మణ్యం భార్య గీతకు ప్రమాద బీమా మంజూరు పత్రాన్ని అందించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పుత్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు అరవ బాలాజీ, వాజ్‌పేయి తదితరులు పాల్గొన్నారు.

వాగ్వాదమే హత్యకు కారణం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య వాగ్వాదమే హత్యకు కారణమని పుత్తూరు సీఐ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. నిందితుడు రవిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈనెల 19న జరిగిన హత్యపై ఆయన వివరాలు వెల్లడించారు. తమిళనాడుచ రాష్ట్రం తిరవళ్లూరుకు జిల్లా కేశవరాజుకుప్పానికి చెందిన రవి... చెన్నై, తిరుత్తణి, అరక్కోణం, రేణిగుంట, వడమాలపేట, పుత్తూరు ప్రాంతాల్లో తిరుగుతూ ప్లాస్టిక్ బాటిళ్లు, కాగితాలు ఏరుకుని గుజిరీకి విక్రయించి వచ్చిన డబ్బు ఖర్చు చేసుకునే వాడు. ఈ నెల 19న తడుకు రైల్వేస్టేషన్ నుంచి చెత్త కాగితాల సంచితో బయలు దేరాడు. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పుత్తూరు మండలం గొల్లపల్లి క్రాస్ వద్ద పల్లూరుకు చెందిన రామ్మూర్తిరెడ్డి తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ పట్టించుకుని వెళ్తుతుండగా రవి లిఫ్ట్ అడిగాడు. ఈక్రమంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన రవి తన వద్ద ఉన్న చాకుతో రామ్మూర్తి రెడ్డి గొంతు, మెడపై దాడి చేశాడన్నారు. ఈక్రమంలో రామ్మూర్తి రెడ్డి సంఘటనా స్థలంలో మృతి చెందాడన్నారు. ఈమేరకు నిందితుడు రవిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

కల్యాణపురంలో కమిషనర్ పర్యటన

పుత్తూరు అర్బన్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ కమిషనర్ డి.వి.నాగేశ్వరరావు 19వ వార్డు కల్యాణపురంలో పర్యటించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడితో కలిసి పలు సమస్యలను పరిశీలించారు. ఫైర్ స్టేషన్ ఎదురుగా మురుగు సమస్య, సిమెంటు రోడ్డు పొడిగింపు, మున్సిపల్ వాటర్ పైప్‌లైన్‌లో నీటి సరఫరా, బీడీ కాలనీలో డ్రైనేజీ సమస్య, డస్ట్ బిన్ల ఏర్పాటు, ఏజీ కాలనీ, ఆర్టీసీ కాలనీల్లో సమస్యలను పరిశీలించారు. వార్డు ఇన్‌చార్జి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కోడ్ల అమలుకు వ్యతిరేకంగా ధర్నా

పుత్తూరు టౌన్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరిస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిక నాలుగు కార్మిక కోడ్లను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ... ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి, నాలుగు కార్మిక కోడ్లను కేంద్రప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడక పోతే తగిన గుణపాఠాన్ని ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. సెల్వరాజ ఆచారి, రమేష్, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, రమణ, శివ, రమేష్, బాష తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయండి

పుత్తూరు టౌన్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనకాయలను వెంటనే పంపిణీ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత డిమాండ్ చేశారు. తొరూరు, పైడిపల్లిల్లో పర్యటించిన అనంతరం ఆమె మాట్లాడుతూ వేరుశనగ సాగు రైతులు దుక్కి దున్ని విత్తనకాయలకోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తొరూరు, పైడిపల్లి చుట్టుపక్కల 50 మంది రైతులు మామిడి పంటకు బీమా చేశారని, అయితే నష్టం వచ్చినా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. వెంకటేష్, కోదండపాణి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని వీఆర్వో అనీఫ్ తెలిపారు. మండలంలోని చిన్నయగుంట రెవెన్యూలో రీ సర్వేపై గ్రామసభలో ఆయన మాట్లాడుతూ... సర్వే జరిగేటప్పుడు రైతులు తమ భూముల దగ్గర రికార్డులతో ఉండాలన్నారు. సర్పంచ్ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో వారాంతపు రద్దీ



శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 257 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,827, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,619 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,186 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 736, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 280, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 204, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 93మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,755 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మలయాళస్వామి విగ్రహం ఊరేగింపు



ఏర్పేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాసాశ్రమ వ్యవస్థాపకుడు మలయాళస్వామి దివ్య మంగళ విగ్రహ ఊరేగింపు శనివారం రాత్రి జరిగింది. ఆదివారం ఆశ్రమ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వామివారి విగ్రహాన్ని ఊరేగించారు.

రోడ్డు పక్కన ఒరిగిన వాహనం



వరదయ్యపాళెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిపాళెం వద్ద శనివారం లారీ రోడ్డు పక్కన ఉన్న గుంతలో ఒరిగింది. వడ్డిపాళెం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన లారీ డ్రైవర్ రోడ్డుపక్కకు వాహనాన్ని దింపాడు. దీంతో గ్యాస్‌పైప్‌లైను కోసం తవ్విన గుంతలోకి కూరుకుపోయింది. అనంతరం వాహనాన్ని బయటకు తీయడంతో సమస్య తీరింది.

లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి



శ్రీకాళహస్తిలో సీఐటీయూ నాయకుల నిరసన

శ్రీకాళహస్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ... బిహార్ ఎన్నికల్లో విజయం అనంతరం కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చిందన్నారు. దీని వలన కార్మికులు సమ్మె హక్కుతో పాటు అనేక ప్రయోజనాలను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 26న సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాలకు పెద్దఎత్తున కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. గురవయ్య, గంధం మణి, ఈశ్వరయ్య, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా జారీ చేసిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం సత్యవేడులో పలు కార్మిక సంఘాలతో కలసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్‌కోడ్ జీవో ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం, కార్మిక సంఘాల నాయకులు విజయభాస్కర్, తిరుమలరెడ్డి, ఏకుమలై రెడ్డి, ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు చిలకమ్మ, శివ, శాంతి, కౌసల్య, శాంతి, సోము, మిరియమ్మ, దేవా పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రూట్స్ డే



శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద మసీదువీధిలో ఉన్న మొగుమి పాఠశాలలో శనివారం యాపిల్ డేను ఘనంగా నిర్వహించారు చిన్నారులు యాపిల్ అలంకరణలో ఆకట్టుకు న్నారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాం డెంట్ ప్రేమ సుందరం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలోని ప్రీప్రైమరీ బ్లాక్‌లో శనివారం ఘనంగా ఫ్రూట్స్‌డేను నిర్వహించారు. చిన్నారురులు పలు రకాల పండ్ల వేషధారణలో వచ్చారు. కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనపురం బ్రిడ్జిపై ట్రాఫిక్ జాం



వరదయ్యపాళెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం బ్రిడ్జిపై శనివారం ట్రాఫిక్ జామ్ కావడంతో మూడు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. దీంతో పరిశ్రమలకు వెళ్లాల్సిన కార్మికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. బ్రిడ్జి మీద పెద్ద గుంతలో కంటైనర్ ఇరుక్కుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వాహన చోదకులు చర్యలు తీసుకోవడంతో రాకపోకలు సాఫీగా సాగాయి.

సీఎంను కలిసిన గాలి చలపతినాయుడు



శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శనివారం సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

ముందు జాగ్రత్త చర్యలు

30 మీటర్ల మేర ఆరె చెరువు కట్ట తొలగింపు




కేవీబీపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరె సమీపంలో ఉన్న పెద్ద చెరువు నిండి కలుజు పారుతోంది. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు కట్ట ఎక్కడ తెగిపోతుందోనని నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన ఈఈ శివారెడ్డి, డీఈ రత్నారెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం కలుజును 30 మీటర్ల పొడవున తవ్వి నీటిని దిగువకు విడుదల చేశారు. సుమారు 20 ఎకరాల్లో ఉన్న చెరువు కింద 1,477 ఎకరాల ఆయకట్టు ఉందని ఛైర్మన్ ప్రసాదనాయుడు తెలిపారు. చెరువు సామర్థ్యం మేరకే నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చెంచయ్యనాయుడికి ఘన సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడిని శనివారం ముస్లింలు ఘనంగా సత్కరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మహమ్మద్ షఫీకి అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ, టౌన్‌బ్యాంకు ఛైర్మన్ ఖాదర్‌బాషా, నాయకులు ఖలీల్‌బాషా, జహీర్ అహ్మద్, మీర్జా, మస్తాన్, ఖాదర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకంగా బోధించాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం చెప్పారు. బీఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన సీఆర్‌సీ సమావేశంలో ఎంఈవోలు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం నుంచే అసెస్‌మెంట్ పుస్తకాలు ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూ పాలన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఐదు మండలాల వ్యవసాయశాఖ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శనివారం శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, క్షేత్రస్థాయిలో ఏటీఎం మోడల్‌పై అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు

నారాయణవనం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశానికి పట్టుకొమ్మలైన యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడదని ఏపీఎం ధనంజయరెడ్డి పేర్కొన్నారు. శనివారం మాదక ద్రవ్యాల ముక్తభారత్‌లో భాగంగా జీఎన్ కండ్రిగ, భీమునిచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కల్పించారు. పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. సీసీలు, సీఆర్పీలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

మన డబ్బులు- మన లెక్కలపై శిక్షణ

వరదయ్యపాళెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు మహిళా సమైక్యలో మన డబ్బులు, మన లెక్కలపై శిక్షణ ఇచ్చారు. ఏవో ప్రసాద్ మాట్లాడుతూ... మన డబ్బులు, మన లెక్కల యాప్ ద్వారా ప్రతి మహిళ పొదుపు, అప్పు, చెల్లింపులు పారదర్శకంగా ఉంటాయని, సంఘాల్లో అవకతవకలు జరిగే అవకాశం ఉండదన్నారు. అనంతరం సంఘ పుస్తక నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. సంఘమిత్రలు, ఈనారీలు, సీసీలు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

శ్రీకాళహస్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు, పాతపాళెం రాయలచెరువు ముంపు బాధితులకు శ్రీకాళహస్తి రెడ్డి వెల్ఫేర్ యూనియన్ నాయకులు చీరలు పంపిణీ చేశారు. చెంచురెడ్డి, సునీల్ కుమార్‌రెడ్డి, మునిరెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.